# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 18 నవంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## పెరిగిన చలి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణవ్యాప్తంగా చలితీవ్రత పెరిగింది. ఎముకలు కొరికే చలికి జనం తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఉదయం వేళల్లో భారీగా పొగమంచు కురుస్తున్నది. దానికి తోడు చలిగాలులు వీస్తుండడంతో జనం అల్లాడుతున్నారు. ఈ క్రమంలో వాతావరణశాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. రాగల రెండురోజులు తెలంగాణలో అక్కడక్కడ కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే నాలుగు నుంచి ఐదు డిగ్రీల వరకు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేసింది. సోమవారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ చలిగాలులు వీస్తాయని హెచ్చరించింది. మంగళవారం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో శీతలగాలులు వీచే ఛాన్స్ ఉందని హెచ్చరించింది.

ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. ఆ తర్వాత రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని చెప్పించింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24 గంటల్లో పలుచోట్ల ఉష్ణోగ్రతలు సింగిల్ మిగితా 2వ పేజీలో

# సౌదీలో ఘోర బస్సు ప్రమాదం...

- 45 మంది సజీవదహనం
- ప్రాణాలతో బయటపడిన ఒకే ఒక్క ప్రయాణికుడు
- ఒకే కుటుంబానికి చెందిన 18 మంది మృతి
- ప్రధాని మోడీ, సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్‌తదితరుల దిగ్భ్రాంతి
- సౌదీకి మంత్రి అజహరుద్దీన్ నేతృత్వంలో బృందం
- మృతుల కుటుంబాలకు రూ.ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సౌదీ అరేబియాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మక్కా నుండి మదీనాకు ప్రయాణిస్తున్న యాత్రికుల బస్సు డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో 45 మంది సజీవదహనమయ్యారు. ట్యాంకర్ నుండి మంటలు చెలరేగి బస్సుకు వేగంగా వ్యాపించడంతో యాత్రికులు బయటపడలేక దుర్మరణం చెందారు. సౌదీ ప్రమాదంలో 45 మంది మృతి చెందారని, వారంతా హైదరాబాద్‌కు చెందిన వారేనని హజ్ కమిటీ పేర్కొంది. ప్రమాదంలో 18 మంది మహిళలు, 17 మంది పురుషులు, 10 మంది చిన్నారులు మృతి చెందినట్లు తెలిపింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. నాలుగు ట్రావెల్ ఏజెన్సీల ద్వారా పర్యాటకులంతా జిద్దాకు వెళ్లారని పేర్కొంది.

నవంబర్ 9న హైదరాబాద్ నుంచి వెళ్లి.. 23న టూర్ ముగించుకుని తిరిగి వచ్చేలా ప్లాన్ చేశారు. ఉమ్రాకు వెళ్లాలంటే.. ముందుగా జిద్దాకు ట్రావెల్ ఏజెంట్లు తీసుకెళ్తారు. ఆదివారం రాత్రి 54 మంది యాత్రికులు వెళ్లారు. వారిలో నలుగురు కారులో మదీనాకు విడివిడిగా ప్రయాణించారు. మరో నలుగురు మక్కాలో ఉన్నారు. 46 మంది బస్సులో వెళ్తుండగా.. ఈ ఘోరప్రమాదం సంభవించింది. భారత కాలమాన ప్రకారం సోమవారం తెల్లవారుజామున 1:30 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. మక్కా నుంచి మదీనాకు వెళ్తుండగా ముఫరహత్ ప్రాంతంలో డీజిల్ ట్యాంకర్‌ను యాత్రికుల బస్సు ఢీకొట్టింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ప్రమాదం జరిగినపుడు ఎక్కువ మంది గాఢనిద్రలో ఉన్నారు. తేరుకునేలోపే కాలి బూడిదయ్యారు. సమాచారం అందిన వెంటనే సౌదీ అధికారులు, రక్షణ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. అయితే ప్రాణాలతో బయటపడిన ఏకైక వ్యక్తి ఎండీ అబ్దుల్ షోయబ్ సౌదీ ఆస్పత్రి ఐసీయూలో ఉన్నారు. మృతుల వివరాలు రహీమున్నీసా, రహమత్ బీ, షెహనాజ్ బేగం, గౌసియా బేగం, కదీర్ మహ్మద్, మహ్మద్ మౌలానా, షోయబ్ మహ్మద్, సోహైల్ మహ్మద్, మస్తాన్ మహ్మద్, పర్వీన్ బేగం, జకియా బేగం, షౌకత్ బేగం, ఫర్హీన్ బేగం, జహీన్ బేగం, మహ్మద్ మంజూరు, మహ్మద్ అలీ. అల్ మీనా ట్రావెల్స్ (మల్లేపల్లి) ద్వారా 16 మంది, ఫ్లైజోన్ ట్రావెల్స్ (మెహిదీపట్నం) ద్వారా 24 మందితో సహా మొత్తం 42 మంది యాత్రికులు సౌదీ వెళ్లినట్లు తెలుస్తోంది.

సౌదీ బస్సు ప్రమాదంపై ప్రధాని మోడి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సౌదీ అరేబియా అధికారులతో భారత సిబ్బంది నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. రియాద్, జిద్దాలోని భారత రాయబార కార్యా లయాలు సహాయక చర్యలు చేపడుతున్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

సౌదీ ప్రమాదంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన పలువురు మరణించినట్లు వస్తున్న వార్తలపై రాష్ట్ర ముఖ్యమంత్రి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన ఆదేశాల మేరకు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు న్యూఢిల్లీలోని రెసిడెంట్ కమిషనర్, భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికారులతో మాట్లాడారు. మృతుల సమాచారాన్ని సేకరించడంతో పాటు బాధిత కుటుంబాలకు తగు సహాయం అందించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.

జిద్దాలోని భారత కాన్సులేట్ జనరల్ 24x7 కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. కుటుంబాలు టోల్ ఫ్రీ నెంబర్లు 8002440003, 00966122614093, 00966126614276, 00966556122301 ద్వారా, వాట్సాప్ ద్వారా సహాయం కోరవచ్చని ప్రకటించింది. కాన్సులేట్ సిబ్బంది , భారతీయ కమ్యూనిటీ వాలంటీర్లు ఆస్పత్రులు , ప్రమాద ప్రదేశాలలో సహాయాన్ని అందించడానికి, అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నారు.

సౌదీ ప్రమాదానికి సంబంధించి రాష్ట్ర సచివాలయంలో ప్రత్యేకంగా ఒక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్టు చీఫ్ సెక్రటరీ తెలిపారు. సహాయ సహకారాల కోసం బాధిత కుటుంబాలు ఈ నెంబర్ల ను సంప్రదించవచ్చు: +91 79979 59754, +91 99129 19545

ఈ ఘటనపై ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కూడా దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, అధికారుల నుంచి సమాచారం సేకరిస్తున్నామన్నారు. మృతుల పూర్తి వివరాలపై మరింత స్పష్టత రావాల్సి ఉంది.

సౌది బస్సు దుర్ఘటనపె డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సంతాపం ప్రకటించారు. బాదిత కుటుంబాలకు అన్ని రకాల సాయం అందిస్తామని అన్నారు. మంత్రులు దనసరి అనసూయ సీతక్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మన్‌కుమార్, ఇతర ప్రముఖులు మృతుల కుటుంబాలకు తమ ప్రగాడ సానుభూతి తెలిపారు.

బస్సు దుర్ఘటనలో మృతి చెందిన బాధిత కుటుంబ బంధువులను సోమవారం కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి పరామర్శించారు. కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఎలాంటి అవసరం ఉన్నా తనను సంప్రదించాలని భరోసా ఇచ్చారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మృతుల బంధువులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని విదాల ఆదుకుంటుందని అన్నారు.





### డిసెంబర్‌లో
# సర్పంచ్ ఎన్నికలు

- కోర్టు తీర్పు తర్వాతే జెడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీ ఎన్నికలు
- డిసెంబర్ రెండోవారంలో నోటిఫికేషన్
- ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం
- పార్టీ తరపున బీసీలకు 42 శాతం టిక్కెట్లు
- సౌదీల యాత్రికుల మృతికి క్యాబినెట్ సంతాపం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో వెంటనే గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. అయితే జెడ్పీటీసీ, ఎమ్‌పీటీసీ, ఎంపీపీ ఎన్నికలను బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తుది తీర్పు తర్వాతే చేపట్టాలని నిర్ణయించారు. పాత రిజర్వేషన్ల ప్రకారమే గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహించాలని పేర్కొంటూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి సిఫార్సు చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రామపంచాయితీలకు 15వ ఆర్థిక సంఘం ప్రతిపాదన మేరకు దాదాపు రూ.3వేల కోట్ల నిధులు రావల్సి ఉందనీ, 2026 మార్చి నాటికి ఆ నిధులు మురిగిపోతాయనీ, అందువల్లే మంత్రివర్గం ఈ నిర్ణయం తీసుకుందని రాష్ట్ర రెవెన్యూ, ప్రజాసంబం ధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.అయితే కాంగ్రెస్‌పార్టీ తరపున పంచాయతీ ఎన్నికల్లో 42 శాతం టిక్కెట్లను బీసీలకు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం లో మంత్రివర్గ సమావేశం జరిగింది. సౌదీ అరేబియాలో బస్సు ప్రమా దంలో మరణించిన బాధిత కుటుంబాలకు రూ. 5 లక్షలు పరిహారం అందించాలనే ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే మంత్రి అజహరుద్దీన్‌తో పాటు నాంపల్లి నియోజకవర్గం ఎంఐఎం ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్, మైనారిటీ విభాగానికి చెందిన ఒక ఉన్నఅధికారితో కూడిన ప్రభుత్వ ప్రతినిధి బృందాన్ని వెంటనే సౌదీకి పంపించాలని నిర్ణయించారు. చనిపోయినవారి క్కడే అంత్యక్రియలు చేయాలనీ, బాధిత కుటుంబ సభ్యుల్లో ఒక్కో కుటుంబానికి ఇద్దరిని ప్రభుత్వ ఖర్చుతో సౌదీకి తీసుకెళ్లేలా అన్ని ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు.

ప్రముఖ కవి, తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందెశ్రీ మరణించడంతో ఆయన కుమారుడు ఎ. దత్త సాయికి డిగ్రీ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం కల్పించేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే తెలంగాణ ఉద్యమంలో అందెశ్రీ పాత్రను భావి తరాలకు తెలియజేసేలా ఆయన అంత్యక్రియలు జరిగిన ప్రాంతంలో స్మృతివనం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అందెశ్రీ రచించిన 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని పాఠశాల పాఠ్యపుస్తకాల్లో మొదటి పేజీలో ముద్రించాలనే నిర్ణయానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

ఎస్సారెస్పీ స్టేజ్-2 మెయిన్ కెనాల్‌కు మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పేరు పెట్టేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీన్ని ఇకపై ఆర్‌డీఆర్ (రాంరెడ్డి దామోదర్ రెడ్డి) ఎస్సారెస్పీ స్టేజ్ - 2 కెనాల్ అని పేరు మారుస్తారు.

ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్‌ఆర్) లోపల ఉన్న ఇండస్ట్రియల్ ల్యాండ్‌ను మల్టీ యూజ్ జోన్స్‌గా మార్చేందుకు రూపొందించిన "హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీకి క్యాబినెట్ ఆమోదించింది.

ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేండ్లు పూర్తవుతున్న సందర్భంగా డిసెంబర్ 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025 నిర్వహించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీనిలో రెండేండ్లలో ప్రజా ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, సాధించిన విజయాలను ఈ వేదిక ద్వారా వివరిస్తారు. అలాగే ఇదే వేదికపై నుంచి డిసెంబర్ 9న తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరించేందుకూ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కొత్త విద్యుత్కేంద్రాల ఏర్పాటుపై మరోసారి అధ్యయనం చేయాలని క్యాబినెట్ సూచించింది.

# స్పీకర్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం



- ఫిర్యాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై నాలుగు వారాల్లోగా తేల్చండి
- తెలంగాణ స్పీకర్‌కు సుప్రీంకోర్టు సీరియస్ వార్నింగ్..

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడంలో జరుగుతున్న జాప్యంపై సుప్రీంకోర్టు సోమవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా జస్టిస్ బి.ఆర్. గవాయి నేతృత్వంలోని ధర్మాసనం తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌కు ఘాటుగా హెచ్చరికలు జారీ చేసింది. గతంలో ఇచ్చిన ఆదేశాలను స్పీకర్ పాటించకపోవడాన్ని"అత్యంత దారుణమైన కోర్ట్ ధిక్కారం"గా ధర్మాసనం అభివర్ణించింది. ఫిరాయింపు ఎమ్మెల్యేల పిటిషన్లపై వచ్చే వారం లోపలే నిర్ణయం తీసుకోవాలని లేదా కోర్టు ధిక్కార చర్యలకు సిద్ధం కావాలని స్పీకర్‌ను ఆదేశించింది.

ఈ సందర్భంగా సీజేఐ జస్టిస్ గవాయి సంచలన వ్యాఖ్యలు చేశారు. "స్పీకర్‌కు రాజ్యాంగ రక్షణ లేదని మేము ఇదివరకే స్పష్టం చేశాం. న్యూ ఇయర్ ఎక్కడ జరుపుకోవాలో ఆయనే నిర్ణయించుకోవాలి," అంటూ జస్టిస్ గవాయి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్ణయం తీసుకోకపోవడాన్ని కాలయాపనగా పరిగణిస్తున్నట్లు కోర్టు స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించనందుకు స్పీకర్‌కు, ఇతరులకు ధర్మాసనం కోర్ట్ ధిక్కార నోటీసులు జారీ చేసింది. ప్రస్తుతానికి స్పీకర్‌కు వ్యక్తిగత హాజరు నుంచి కోర్టు మినహాయింపు ఇచ్చింది. అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడానికి మరో ఎనిమిది వారాల గడువు కోరుతూ స్పీకర్ కార్యాలయం దాఖలు చేసిన పిటిషన్‌పై కూడా చీఫ్ జస్టిస్ ధర్మాసనం ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. ఈ మ్యాటర్‌ను నాలుగు వారాల్లో వింటామని ధర్మాసనం తెలిపింది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద స్పీకర్ 'ట్రిబ్యునల్' లాగా వ్యవహరిస్తున్నప్పుడు ఆయనకు ఎలాంటి రాజ్యాంగ రక్షణ ఉండదని సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా గుర్తుచేసింది.

## నేషనల్ మెరిట్ స్కాలర్ షిప్స్ కోసం నవంబర్ 30 వరకు గడువు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

నేషనల్ మెరిట్ స్కాలర్ షిప్స్ కోసం నవంబర్ 30 వరకు గడువున్నట్టు ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర విద్యాశాఖ స్కాలర్ షిప్ స్కీంను కాలేజీ, యూనివర్సిటీ విద్యార్థుల కోసం అందిస్తున్నది. ఈ స్కాలర్ షిప్ కోసం ఫ్రెష్ దరఖాస్తులతో పాటు రెన్యూవల్ దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఇనిస్టిట్యూషన్ నోడల్ ఆఫీసర్ వెరిఫికేషన్ ను డిసెంబర్ 15లోపు పూర్తి చేయాల్సి ఉంటుంది. దరఖాస్తులను http://scholarships.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

## 50 శాతం దాటొద్దు

### మహారాష్ట్రలో స్థానిక సంస్థల ఎన్నికలపై సుప్రీం కీలక వ్యాఖ్యలు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

స్థానిక సంస్థల (లోకల్ బాడీ) ఎన్నికల్లో రిజర్వేషన్లు ఎట్టి పరిస్థితుల్లోనూ 50 శాతం మించకూడదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. మహారాష్ట్రలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో కోర్టు ఇచ్చిన పూర్వ ఉత్తర్వులను అధికారులు తప్పుగా అర్థం చేసుకున్నారని ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీ ధర్మాసనం పేర్కొంటూ, "ఎన్నికలు ఎప్పుడూ చట్టానుగుణంగా జరగాల్సిందే. రిజర్వేషన్లు 50% మించకూడదని చట్టంలో స్పష్టంగా ఉంది" అని పేర్కొంది. మహారాష్ట్ర అధికారులు సుప్రీం కోర్టు పూర్వ ఆదేశాలను తప్పుగా అర్థం చేసుకున్నారని, కోర్టు ఎక్కడా 50 శాతం మించవచ్చని సూచించలేదని ధర్మాసనం తేల్చిచెప్పింది.

బాంథియా కమిషన్ నివేదికకు ముందు అమల్లో ఉన్న రిజర్వేషన్ల ఆధారంగా ఎన్నికలు జరపాలని మే 6న జారీ చేసిన ఆదేశాలను సుప్రీం మరోసారి గుర్తు చేసింది. లోకల్ బాడీ రిజర్వేషన్ల అంశం ప్రస్తుతం తెలంగాణలోనూ చర్చనీయాంశంగా మారింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం మించి రిజర్వేషన్లు అనుమతి ఇవ్వలేమని తెలంగాణ హైకోర్టు ఇప్పటికే స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

# ఐ బొమ్మ నిందితుడి హార్డ్‌డిస్క్‌లో 21వేల సినిమాలు





- బెట్టింగ్ యాప్‌ల ద్వారా రూ. 21కోట్లు
- సైబర్‌నేరస్తులకు రూ.56 లక్షల వినియోగదారుల డేటా విక్రయం
- అవసరమైతే ఈడీ, సీబీఐ సహకారం
- వివరాలు వెల్లడించిన హైదరాబాద్ సీపీ సజ్జనార్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

పైరసీలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన ఐబొమ్మ ఎట్టకేలకు బంద్ అయింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఐబొమ్మ పైరసీ రాకెట్‌ను హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు ఛేదించారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమకు వేల కోట్ల రూపాయల నష్టాన్ని కలిగించిన ఈ కేసులో ప్రధాన నిందుతుడితో సహా ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు కీలక విషయాలు రాబట్టారు. సోమవారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని సీసీసీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రముఖులు చిరంజీవి, రాజమౌళి, నాగార్జున, దిల్‌రాజు, సరేశ్‌బాబు, పలువురు పోలీస్ అధికారులతో కలిసి హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ వివరాలను వెల్లడించారు. ఎవరో సమాచారం ఇస్తే ఇమ్మడి రవిని అరెస్టు చేయలేదని, పోలీసులే కష్టపడి నిందితుడిని అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారని స్పష్టం చేశారు. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్(టీఎఫ్‌సీసీ) యాంటీ-వీడియో పైరసీ సెల్‌నుంచి ఫిర్యాదు అందిందన్నారు. అన్ని కోణాలల్లో విచారణ చేయడంతో సంచలన విషయాలు వెలుగు చూశాయన్నారు.


2010లో వెబ్‌సైట్ డెవలప్‌మెంట్‌లో ప్రత్యేకత సాధించిన రవి 'ఇఆర్ ఇన్‌ఫోటెక్' అనే పేరుతో వెబ్‌సర్వీసెస్ సంస్థను స్థాపించాడు. ఆన్‌లైన్ కంటెంట్ పెరగడం, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లపై ప్రజాదరణను గమనించాడు. ఆన్‌లైన్‌లో స్ట్రీమింగ్‌కు అధిక డిమాండ్‌ను చూసి ఉచితంగా నాణ్యత గల సినిమా వెబ్‌సైట్‌ను సృష్టించాడు. ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌లతో చేతులు కలిపాడు. కోవిడ్-19లో మిగితా 2వ పేజీలో

# గచ్చిబౌలిలో హైడ్రా కూల్చివేతలు

**బలగం టీవి, హైదరాబాద్**

రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలి సంధ్య కన్వెన్షన్‌లో హైకోర్టు ఆదేశాల మేరకు హైడ్రా మరోసారి సోమవారం కూల్చివేతలు చేపట్టింది. హైడ్రా అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. గచ్చిబౌలిలోని ఫెర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎంప్లాయీస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లే అవుట్‌లో సంధ్యా కన్వెన్షన్ యజమాని శ్రీధరరావు ఆక్రమణలపై పలువురు బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం గత మంగళవారం సంధ్యా శ్రీధర్‌రావుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రహదారులు ఆక్రమించి పలు నిర్మాణాలు చేపట్టడాన్ని సీరియస్‌గా పరిగణించింది. మొత్తం 20 ఎకరాల పరిధిలో వేసిన లే అవుట్‌లో 162 వరకు ప్లాట్లుండగా.. అందులోని మెజార్టీ ప్లాట్లు తనవే అనే ఉద్దేశ్యంతో రహదారులు, పార్కులు ఆక్రమిస్తే వ్యవస్థలు చూస్తూ ఊరుకోవని హెచ్చరించింది. హైడ్రా అందుకే ఆక్రమణలను తొలగించిందని పేర్కొంది. ఒకసారి లే అవుట్ వేస్తే.. అదే కొనసాగుతుందని స్పష్టం చేసింది.

సంధ్యా శ్రీధర్‌రావు రహదారుల ఆక్రమణలను ఇటీవల హైడ్రా తొలగించిన విషయం తెలిసిందే. ఈ విషయమై సంధ్యా శ్రీధర్‌రావు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు విచారణలో భాగంగా జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి పై వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా బాధిత ప్లాట్ యజమానులు కూడా వారి గోడును హైకోర్టుకు విన్నవించుకున్నారు. లే అవుట్‌లో సరిహద్దులన్నీ చెరిపేసి ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్నారని సంధ్యా శ్రీధర్‌రావుపై ఫిర్యాదు చేశారు. ఎక్కువ ప్లాట్లు కొని.. తమను భయపెట్టి మిగతావి కూడా సొంతం చేసుకోవాలని శ్రీధర్‌రావు ప్రయత్నించారని బాధితులు న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్లారు. ఎక్కువ





ప్లాట్లు తనవే ఉన్నాయని.. లే అవుట్‌లోని రహదారులు, ఆ పక్కనే ఉన్న తమ ప్లాట్లు, పార్కులు సరిహద్దులు పట్టించుకోకుండా నిర్మాణాలు చేపట్టారని హైకోర్టుకు తెలిపారు. ఇదేమని అడిగితే తమపై దాడి చేసేవారని బాధితులు వాపోయారు. ఓ ప్లాట్ యజమానురాలిపై దాడి చేయడమే కాకుండా తప్పుడు కేసులు కూడా పెట్టారని సంధ్యా శ్రీధర్‌రావుపై బాధితులు ఫిర్యాదు చేశారు. ఇందుకు గాను సంధ్య శ్రీధర్‌రావుకు రూ.10 లక్షలు సుప్రీంకోర్టు ఫైన్ విధించిన విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. తమ ప్లాట్లు చూడటానికి కూడా వీలు లేకుండా చేశారని వాపోయారు. నేరుగా దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేసిన సమయంలో తాము హైడ్రాను ఆశ్రయించామని బాధితులు తెలిపారు. హైడ్రా అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించి, రహదారుల ఆక్రమణలను నిర్ధారించాక చర్యలు తీసుకున్నారని చెప్పారు. తమ ఇబ్బందులు కోర్టుకు విన్నవించుకోవడానికే.. తాము ఈ కేసులో ఇంప్లీడ్ అయ్యామని చెప్పారు. బాధితుల ఫిర్యాదులన్నీ విన్నాక జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి ఇప్పటికే రహదారుల పునరుద్ధరణకు తాము హైడ్రాకు సూచించామని బాధితులకు తెలిపారు. మిగితా 2వ పేజీలో

## బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు మరణశిక్ష

### బంగ్లాదేశ్ అల్లర్ల కేసులో ఐసీటీ సంచలన తీర్పు

**బలగం టీవి, ఢాకా**

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాపై ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ సోమవారం సంచలన తీర్పు వెలువరించింది. గత సంవత్సరం జరిగిన అల్లర్ల కేసులో ఆమెను దోషిగా తేల్చి మరణశిక్ష విధించింది. మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలు, నిరసనకారులపై అమానుష చర్యల ఆరోపణలు ఆమెపై నిర్ధారణకు వచ్చినట్లు కోర్టు పేర్కొంది. గత ఏడాది జూలై%-%ఆగస్టు నెలల్లో జరిగిన ఆందోళనల్లో 1400 మంది ప్రాణాలు కోల్పోయారు అని న్యాయమూర్తి వివరించారు. నిరసనకారులను అణచివేయడానికి "వారిని చంపేయండి" అని హసీనా ఆదేశాలు జారీ చేసినట్లు ట్రైబ్యునల్ తీర్పులో పేర్కొంది. ఈ కేసులో మాజీ హెూంమంత్రి అసదుజ్జమాన్ ఖాన్కు కూడా మరణశిక్షను విధించింది. అలాగే మాజీ పోలీస్ చీఫ్ చౌధురి అబ్దుల్లా అల్-మామున్కు ఐదేళ్ల జైలు శిక్షను ప్రకటించింది.

ఢాకాలో ఆగస్టు 5న జరిగిన నిరసనల్లో ఆర్మీని కాల్పులు జరపాలని, హెలికాప్టర్లు మరియు ప్రాణాంతక ఆయుధాలు ఉపయోగించాలని హసీనా ఆదేశించినట్లు మరో న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. గాయపడిన వారికి వైద్యం అందించడానికి కూడా ఆమె నిరాకరించినట్లు వెల్లడించారు. తీర్పు నేపథ్యంలో బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో హై అలర్ట్ ప్రకటించారు. వాహనాలు తగలబెట్టే లేదా బాంబులు విసరడానికి యత్నించే వారిని చూసినచోటే కాల్చివేయాలని పోలీస్ చీఫ్ షేక్ మహమ్మద్ సజ్జాద్ అలీ ఆదేశించి భారీ భద్రతను ఏర్పాటు చేశారు.విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో ప్రధాని పదవి నుంచి దిగిపోయిన హసీనా గత ఆగస్టు 5న దేశం మిగితా 2వ పేజీలో

## రెండోసారి ఏసీబీకి చిక్కిన సివిల్ సప్లయ్స్ డీటీ



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణంలోని ఓ రేషన్ షాపు డీలర్ నుంచి రూ.30 వేలు లంచం తీసుకుంటూ డీలర్ షాప్స్ అసోసియేషన్ అధ్యక్షులు శబరీష్ ఏసీబీకి పట్టుపడ్డాడు. శబరీష్ ఇచ్చిన సమాచారం మేరకు సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ మహమ్మద్ యాకుబ్ పాషా, ఈ పాస్ టెక్నీషియన్ అసిస్టెంట్ ఎ.విజయ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రేషన్ షాపులో సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ మహమ్మద్ యాకుబ్ పాషా తనిఖీ చేశారు. స్టాక్ తక్కువగా ఉందని గమనించారు. రూ.30 వేలు ఇవ్వాలని సంబంధిత డీలర్‌ను అడిగారు. అంత మొత్తం ఇచ్చుకోలేనని చెప్పినప్పటికీ కనికరించలేదు. శబరీష్ కూడా రూ.30 వేలు ఇవ్వాలని ఒత్తిడి చేశారు. తనవద్ద అంత డబ్బు లేకపోవడంతో రేషన్ డీలర్ ఏసీబీని సంప్రదించాడు. ఈ క్రమంలో జగదాంబ సెంటర్‌లోని శబరీష్‌కు చెందిన ఓ షాపులో రేషన్ డీలర్ రూ.30 వేలు లంచం ఇస్తుండగా పట్టుపడినట్టు తెలిపారు. అనంతరం రేషన్ డీలర్ అసోసియేషన్ అధ్యక్షుడిని తహసీల్దార్ కార్యాలయానికి తరలించి విచారించగా సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ మహమ్మద్ యాకుబ్ పాషా, ఈ పాస్ టెక్నీషియన్ అసిస్టెంట్ ఎ.విజయ్ ఒత్తిడి మేరకే లంచం అడిగినట్టు ఒప్పుకున్నారు. మహమ్మద్ యాకుబ్ పాషా గతంలో 2011లో కొణిజర్లలో లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారని తెలిపారు. ఎవరైనా లంచాలు అడిగితే 1064 నెంబర్‌కు ఫోన్ చేయాలని ఏసీబీ డీఎస్పీ రమేశ్ తెలిపారు.

## బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు మరణశిక్ష

### బంగ్లాదేశ్ అల్లర్ల కేసులో ఐసీటీ సంచలన తీర్పు

(మొదటి పేజీ తరువాయి)

వీడి భారతదేశానికి చేరుకున్నారు. ప్రస్తుతం న్యూఢిల్లీ లోని ఓ రహస్య ప్రదేశంలో నివసిస్తున్నారు. తీర్పు వెలువడేముందు ప్రజలకు ఇచ్చిన సందేశంలో హసీనా ఇలా పేర్కొన్నారు

"నేను బ్రతికే ఉన్నాను ఉంటాను. నా ప్రజల కోసం పనిచేస్తాను. ఏ తీర్పు వచ్చినా నాకు భయం లేదు. దేవుడే ప్రాణం ఇచ్చాడు, ఆయనే తీసుకుంటాడు. ఈ దేశం కోసం నా కుటుంబాన్ని కోల్పోయాను. గూన్‌లు, ఉగ్రవాదులు విప్లవం తెచ్చుకోలేరు" అని మండిపడ్డారు.

## గచ్చిబౌలిలో హైడ్రా కూల్చివేతలు

(మొదటి పేజీ తరువాయి)

అందులోని ప్లాట్ల యజమా నులకు అండగా హైకోర్టు ఉంటుందని ధైర్యం చెప్పారు. లే అవుట్‌లోని రహదారులను, పార్కుల ను పునరుద్ధరించాలని హైడ్రాకు హైకోర్టు మరో సారి సూచించింది. ఫైనల్ హియరింగ్ కోసం ఈనెల 18వ తేదీకి కేసును వాయిదా వేసింది. ఈ నేపథ్యంలోనే హైడ్రా సోమవారం ఉదయమే కూల్చి వేతలు చేపట్టింది. ఫెర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎంప్లాయీస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లే అవుట్‌లో అక్రమ కట్టడాలను నేలమట్టం చేసింది. అనుమతులు లేని షెడ్స్‌ను తొలగించింది.

## పెరిగిన చలి

(మొదటి పేజీ తరువాయి)

డిజిట్‌కు పడిపోయాయి. ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో అత్యల్పంగా 7.4 డిగ్రీ సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత నమోదైందని వాతావరణశాఖ తెలిపింది. రాగల రెండు రోజులు చలి తీవ్రత మరింత పెరుగుతుందని వాతావరణశాఖ హెచ్చరించింది. అదే సమయంలో హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. సోమవారం ఉదయం ఈ సీజన్‌లోనే ఉష్ణోగ్రతలు కనిష్టానికి పడిపోయాయని వాతావరణశాఖ తెలిపింది. హైదరాబాద్ యూనివర్సిటీ పరిధిలో 8.8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైందని పేర్కొంది. రాజేంద్రనగర్‌లో 10, కంటోన్మెంట్‌లో 11.2, మారేడ్‌పల్లిలో 11.5, కుత్బుల్లాపూర్‌లో 12, గచ్చిబౌలిలో 12 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయని.. సోమవారం రాత్రి సైతం చలి కొనసాగే అవకాశం ఉందని తెలిపింది. మంగళవారం ఉదయం సైతం ఇలాంటి పరిస్థితులే ఏర్పడే అవకాశాలున్నాయని హెచ్చరించింది.

## ఫతేనగర్‌లో గంజాయి పట్టివేత

- రెండు కేసుల్లో 9 మందిపై కేసు నమోదు
- ఒక మహిళ అరెస్టు, పరారీలో మిగతా నిందితులు

బలగం టీవీ, హైదరాబాద్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాలానగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఫతేనగర్‌లో గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. గంజాయి అక్రమ నిల్వ, విక్రయంపై అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్టీఎఫ్ 'ఏ' బృందం బాలానగర్ ఎక్సైజ్ పోలీసులతో కలిసి ఆదివారం రాత్రి సంయుక్తంగా దాడులు నిర్వహించింది. ఈ ఘటనకు సంబంధించి రెండు గ్రూపులకు చెందిన నిందితులపై రెండు వేర్వేరు కేసులు నమోదు చేశారు. మొత్తం 9 మందిపై కేసులు నమోదు చేశారు. మొదటి కేసులో 2.1.054 కిలోల గంజాయి సీజ్ చేశారు. ఈ కేసులో నలుగురిపై కేసు నమోదు చేయగా, ఫతేనగర్‌కు చెందిన కె. రాఖీ దేవి అనే మహిళా పెడ్లర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మిగిలిన ముగ్గురు నిందితులు కాళీవాల వరలక్ష్మి అలియాస్ వరమ్మ, కాళీవాలన్ అలియాస్ సుదర్శన్ (పెడ్లర్లు), ఎస్లీ కవిత (సప్లయర్) పరారీలో ఉన్నారు. ఇక రెండో కేసులో 1.054 కిలోల ఎండు గంజాయి, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఐదుగురిపై కేసు నమోదు చేశారు. శక్తి రోజా, శక్తి రాశి, శక్తి మల్లికార్జున్, శక్తి భూమిక, శక్తి రూపేష్ అలియాస్ విఘ్నేష్ కుమార్ పరారీలో ఉన్నారు. ఒడిశా నుంచి గంజాయి కొనుగోలు చేసి వాటిని చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి ఫతేనగర్ పరిసర ప్రాంతాల్లోని వినియోగదారులకు విక్రయిస్తున్నట్టు అధికారులు గుర్తించారు. అరెస్టు చేసిన నిందితురాలు, స్వాధీనం చేసుకున్న గంజాయి, ఇతర వస్తువులతో పాటు కేసు పత్రాలను తదుపరి దర్యాప్తు నిమిత్తం ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్, బాలానగర్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించినట్టు అధికారులు తెలిపారు.

## సెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు 'దండోరా'

బలగం టీవీ, హైదరాబాద్




నేషనల్ అవార్డ్ గెలుచుకున్న 'కలర్ ఫోటో', బ్లాక్‌బస్టర్ 'బెదురులంక 2012' వంటి విజయవంతమైన చిత్రాలను అందించిన లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత రవీంద్ర బెనర్జీ ముప్పానేని నిర్మిస్తున్న తాజా చిత్రం 'దండోరా' డిసెంబర్ 25న క్రిస్మస్ కానుకగా విడుదలకు సిద్ధమైంది. మురళీకాంత్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, మనికా చిక్కాల, మౌనికా రెడ్డి, బిందు మాధవి తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సందర్భంగా మేకర్స్ టీజర్‌ను విడుదల చేశారు. నటుడు నవదీప్ సర్పంచ్ పాత్రలో కనిపిస్తూ, "మేం తంతే లేవనోళ్లు అయినొచ్చి గొకితే లేస్తరని ఎందివయా ఇది" అనే తెలంగాణ యాస డైలాగ్‌తో ఆకట్టుకున్నాడు. మరో కీలక పాత్రలో శివాజీ కనిపించారు. నటి బిందు మాధవి వేశ్య పాత్రలో కనిపించడం టీజర్‌లో షాక్ ఇస్తుంది. ఆమె చెప్పిన "ఎవరు చెప్పారు నేను తప్పు చేస్తున్నానని%ౌ% వాళ్లు డబ్బులిస్తున్నారు%ౌ% నేను వాళ్లకి సర్వీస్ చేస్తున్నాను" అనే డైలాగ్ హైలైట్‌గా నిలిచింది. శవాన్ని మోసుకెళ్లే దృశ్యం, జీవితం%-%మరణం పై శివాజీ పలికిన తాత్విక డైలాగులు సినిమా గంభీరతను తెలియజేస్తున్నాయి."నాలుగు పుస్తకాలు చదివి ప్రపంచం అంతా తెలిసినట్టు మాట్లాడొద్దు నీకు తెలియని లోకం ఇంకోటుందిరా" అని శివాజీ చెప్పిన మాటలు ఆలోచన రేకెత్తిస్తున్నాయి.

## పోషకాహార లోపరహిత తెలంగాణను నిర్మించడమే లక్ష్యం

- మంత్రి సీతక్క
- ప్రీస్కూల్ చిన్నారులకు ప్రతిరోజూ పాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి



బలగం టీవీ, హైదరాబాద్

రాష్ట్రంలోని పేద పిల్లలకు బలమైన ఆహారం అందించి, పోషకాహార లోపాన్ని అధిగమించి పోషకాహార లోపరహిత తెలంగాణను నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. చిన్న పిల్లలు దేవుళ్లతో సమానమని, అంగన్వాడీ టీచర్లు వారిని సొంత పిల్లల్లా చూసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోనే తొలిసారిగా చేపట్టిన పైలట్ ప్రాజెక్టులో భాగంగా ములుగు జిల్లా కేంద్రంలోని కృష్ణా కాలనీ అంగన్వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ చిన్నారులకు ప్రతిరోజూ 100 మి.లీ పాల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం మంత్రి ప్రారంభించారు. ములుగు జిల్లాలో పేదరికం అధికంగా ఉండటంతో ఈ కార్యక్రమాన్ని ఇక్కడి నుండే మొదలుపెట్టినట్టు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంగన్వాడీ సెంటర్లను బలోపేతం చేయడానికి ఇప్పటికే పలు నిర్ణయాలు తీసుకున్నారని, టీచర్లకు చీరలు పంపిణీ చేయడంతోపాటు వేతనాలు పెంచారని అన్నారు. కార్పొరేట్ స్థాయి పాఠశాలలకు దీటుగా సెంటర్లను బలోపేతం చేస్తున్నామని, టీచర్లు తల్లిదండ్రులతో నిత్యం సమావేశాలు నిర్వహించాలని సూచించారు. అంగన్వాడీ టీచర్లు అనుకోకుండా మృతి చెందితే వారి పిల్లలకు ఉద్యోగాలు కల్పించడానికి ప్రభుత్వం జీవో జారీ చేస్తుందని, ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేరుస్తామని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలపై ప్రజలకు నమ్మకం కలిగేలా విధులు నిర్వహించాలని కోరారు. అనంతరం వయోవృద్ధుల వారోత్సవాల్లో భాగంగా పోస్టర్లను ఆవిష్కరించిన మంత్రి, తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే పిల్లల ఆస్తులను జప్తు చేసి తల్లిదండ్రుల పేరు మీదకు మార్పిడి చేస్తామని హెచ్చరించారు. బాలల హక్కుల పరిరక్షణతోపాటు బాల్య వివాహాలపై ఏర్పాటు చేసిన పోస్టర్లను కూడా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఐటీడీఏ పీవో చిత్రమిశ్ర, అదనపు కలెక్టర్ మహేందర్ జి, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మెన్ రేగ కళ్యాణి, ఆత్మ కమిటీ చైర్మెన్ రవీందర్ రెడ్డి, డీడబ్ల్యూఓ తుల రవి, సీడీపీఓ శిరీష, సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఐ బొమ్మ నిందితుడి హార్డ్‌డిస్క్‌లో 21వేల సినిమాలు

(మొదటి పేజీ తరువాయి)

లాక్‌డౌన్ సమయంలో ప్రజలు ఇండ్లకు పరిమితంకావడంతో, థియేటర్లు మూతపడ్డాయి. కొత్త సినిమాలు చూడాలంటే అనేక ఓటీటీ ప్లాట్‌ఫామ్స్‌లకు సబ్‌స్క్రైబ్ చేయాల్సి వచ్చింది. అదే అదునుగా 2019లో ఐబొమ్మ, 2022లో బప్పమ్ అనే రెండు వెబ్‌సైట్లను సృష్టించాడు. అందులో అనధికారింగా సినిమాలను అప్‌లోడ్ చేసేవాడు. ఈ వెబ్‌సైట్‌లో కొత్తగా విడుదలైన థియేట్రికల్, ఓటీటీ చిత్రాలను హెచ్‌డీ నాణ్యతతో ఉంచేవాడు. నిందితుడు 56 వెబ్‌సైట్ల ద్వారా అక్రమంగా పైరసీ సినిమాలను ఫ్రీగా చూపిస్తూ దాదాపు 56లక్షల మంది డేటాను తస్కరించాడు. ఆ డేటాను సైబర్ నేరస్తులకు విక్రయించాడు. నిందితుడి వద్ద స్వాధీనం చేసుకున్న హార్డ్ డిస్కులలో మొత్తం 21వేల పైరసీ సినిమాలున్నాయి. వీటిలో 1972 నాటి 'ది గాడ్ ఫాదర్' నుంచి 2025 నాటి 'ఓజీ' సినిమాలున్నాయి. పైరసీల ద్వారా రూ.21కోట్లు సంపాదించాడు. బీఎస్సీ కంప్యూటర్ పూర్తిచేసిన రవి 2022కు ముందు ఓ ముస్లిం అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. పోలీసుల నుంచి తప్పించుకునేందుకు 2022లో భారత పౌరసత్వాన్ని వదులుకున్న రవి.. అదే సంవత్సరం దాదాపు రూ.80 లక్షలు చెల్లించి కరేబియన్ పౌరసత్వాన్ని తీసుకున్నాడు. 2022 నుంచే రవి కరేబియన్ దీవుల్లో ఉంటున్నాడు. పోలీసులకు చిక్కకుండా నెదర్లాండ్స్, స్విట్జర్లాండ్‌తోపాటు వివిధ దేశాలల్లో భౌతిక సర్వర్లను ఏర్పాటు చేశాడు. 900కుపైగా వెబ్‌సైట్లను సృష్టించాడు. నిందితుడి వెబ్‌సైట్‌లు నెలకు 5 మిలియన్లకుపైగా వినియోగదారులను నమోదు చేశాయి. అతని బ్యాంక్ ఖాతాలు, క్రిప్టోకరెన్సీ వాలెట్లలో ఉన్న నిధులను పోలీసులు ఫ్రీజ్ చేశారు. భారత్‌లో ఉన్న ఆస్తులను అమ్ముకోవడానికి మూడు రోజుల క్రితమే భారత్‌లో అడుగుపెట్టినట్టు సమాచారం రావడంతో పోలీసులకు చిక్కాడు. కరేబియన్ దీవుల్లో రవి విలాసవంతమైన జీవితాన్ని గడుపుతున్నాడు. రవికి సహకరించిన నెల్లూరుకు చెందిన దుద్దెల శివాజీ, పుణేకు చెందిన సుసర్ల ప్రశాంత్ సెప్టెంబర్ 24న పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో అవసరమైతే ఈడీ, సీబీఐ సహకారం తీసుకుంటామని సీపీ తెలిపారు. పైరసీని ప్రోత్సహించొద్దని సీపీ కోరారు.

ఇంత మంది కష్టాన్ని, కళాకారుల జీవితాలను ప్రశ్నార్థకం చేస్తూ దోచుకుంటుంటే తమకు చాలా కష్టంగా ఉంటోందని సినీ నటుడు మెగాస్టార్ చిరంజీవి ఆవేదన వ్యక్తం చేశారు. గత సీపీ సీవీ ఆనంద్, ప్రస్తుత సీపీ సజ్జనార్ ఎంతో కృషిచేసి నిందితుడిని పట్టుకోవడం తమకు ఊరటనిచ్చిందన్నారు. ప్రజలుకూడా సినిమా మాది అని భావించి, పైరసీ చూడొద్దని కోరారు. పోలీసులకు ఛాలెంజ్ విసిరిన పైరసీ రాకెట్ నిందితుడిని అరెస్టు చేయడం సినిమా క్లైమాక్స్ లాగా ఉందని సినీ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి అన్నారు. రవిని హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేసిన తర్వాత చెన్నై నుంచి తన స్నేహితుడు ఫోన్ చేసి 'మేం చేయలేనిది మీరు చేశారు' అన్నాడన్నారు. డీసీపీ ధార కవిత మాట్లాడుతూ నిందితుడు రవి టెలిగ్రామ్ ద్వారా పైరసీ మూవీ కోసం వెతకడం, ఓటీటీ సర్వర్లు క్రాక్ చేయడం ద్వారా సినిమాలు అప్‌లోడ్ చేస్తున్నాడని వివరించారు. గూగుల్ డేటా సెంటర్‌తో మాట్లాడి, క్లౌడ్ ఫ్లేర్ వారి సహకారంతో నిందితుడిని అరెస్టు చేశామన్నారు.

## ఢిల్లీ బాంబు పేలుళ్లలో మరో కీలక కుట్రదారుడు అరెస్టు

బలగం టీవీ, హైదరాబాద్

ఎర్రకోట సమీపంలో జరిగిన బాంబు పేలుడు ఘటన కేసులో కీలక కుట్రదారుడ్ని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అరెస్టు చేసింది. జూసిర్ బిలాల్ వాని అలియాస్ డానిష్‌ను జమ్మూకాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో అరెస్టు చేసినట్టు ఎన్ఐఏ సోమవారం ప్రకటించింది.డానిష్‌ను అనంత్‌నాగ్ లోని ఖాజీగుండ్ నివాసిగా తెలిపింది. కారు బాంబుతో ఆత్మహుతికి పాల్పడ్డ ఉగ్రవాది ఉమర్ ఉన్ నబీతో కలిసి డానిష్ పనిచేశాడని పేర్కొంది. నబీకి డ్రోన్లను నడపడం, రాకెట్లను తయారు చేయడం వంటి విషయాల్లో సాంకేతిక సహాయం చేశాడని ఎన్ఐఏ ఆరోపించింది. కాగా, ఈ కేసులో ఇప్పటికే అమీర్ రషీద్ అలీని ఎన్ఐఏ అరెస్టు చేసింది. బాంబు పేలుడుకు ఉపయోగించిన కారు అలీ పేరు మీదనే రిజిస్టర్ అయిఉంది. అలీని సోమవారం ప్రత్యేక కోర్టు ముందు ఎన్ఐఏ హాజరు పర్చింది. అలీకి 10 రోజుల ఎన్ఐఏ కస్టడీని కోర్టు విధించింది. అలాగే నబీకి చెందిన మరో కారును కూడా ఎన్ఐఏ స్వాధీనం చేసుకుంది. కాగా, ఈ కేసులో ఆధారాల కోసం పేలుడుల్లో గాయపడివారితో సహా 73 మందిని ఎన్ఐఏ ఇప్పటి వరకూ విచారించింది. అలాగే, ఢిల్లీ, జమ్మూకాశ్మీర్, హర్యానా, ఉత్తరప్రదేశ్ పోలీసులతో పాటు వివిధ సంస్థలతోనూ సమన్వయంతో ఎన్ఐఏ పనిచేస్తోంది.

## బాసర లిఫ్ట్ ఇరిగేషన్ మరమ్మత్తులకు రూ1.17 కోట్లు

- జీవో విడుదల

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

బాసర లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ అత్యవసర మరమ్మతుల కోసం రూ.కోటీ 17లక్షలా 80 వేల నిధులు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతి మంజూరు చేసింది. ఈ మేరకు నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జ సోమవారం జీవో 303 విడుదల చేశారు. ఇంజనీర్–ఇన్–చీఫ్, హైదరాబాద్ ప్రతిపాదనల మేరకు నిధులు మంజూరు చేసినట్టు ఉత్తర్వులో పేర్కొన్నారు. అంచనాలో చేసిన పరిమాణాలు, ఆమోదించబడిన ధరల ప్రకారం పనులు చేపట్టాలని ఆదేశించారు. తదనుగుణంగా అవసరమైన చర్య తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

# 'చెప్పిన పని లేదు, జీతం లేదు..

- పాస్‌పోర్ట్ గుంజుకున్నారు'
- దుబాయ్‌లో సిరిసిల్ల బాధితుడు దాసరి పరుశురాములు ఆవేదన
- స్వస్థలానికి రప్పించాలని విజ్ఞప్తి



**బలగం టీవీ, ఇల్లంతకుంట**

రాజన్న సిరిసిల్ల జిల్లా, ఇల్లంతకుంట మండలం, సిరికొండ గ్రామానికి చెందిన దాసరి పరుశురాములు దుబాయ్‌లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంచి భవిష్యత్తు కోసం, తన ముగ్గురు ఆడపిల్లల కోసం అప్పులు చేసి లక్షన్నర రూపాయలు ఏజెంట్‌కు చెల్లించి ఈ నెల 13వ తేదీన దుబాయ్ వెళ్లిన ఆయన అక్కడ మోసపోయారు. తాను దుబాయ్‌కి చేరుకున్నాక, ఏజెంట్ చెప్పిన పని, జీతం లేవని, కంపెనీ వారు వేధిస్తున్నారని పరుశు రాములు ఆవేదన వ్యక్తం చేశారు. "మీ ఏజెంట్ ఏం చెప్పినా మాకు సంబంధం లేదు, మేము చెప్పిన పని మాత్రమే చేయాలి. లేదంటే ఇండియన్ కరెన్సీలో ?2 లక్షలు కట్టి వెళ్లిపోవాలి" అని కంపెనీ యజమానులు తనను నానా దుర్భాషలాడి, పాస్‌పోర్ట్‌ను గుంజుకున్నారని బాధితుడు తెలిపారు. చేతిలో చిల్లిగవ్వ లేదని, అప్పు చేసి వచ్చిన తనను కంపెనీవారు బందీగా మార్చారని పరుశురాములు కన్నీరుమున్నీరయ్యారు. "నాకు దిక్కు తోచడం లేదు సార్. నా దగ్గర రెండు లక్షలు కట్టడానికి ఏమీ లేవు. దయచేసి నన్ను మన్నించి, ఆదుకుని స్వదేశానికి రప్పించాలని" ఆయన బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల శాసనసభ్యులు కల్వకుంట్ల తారకరామారావు ని పరుశు రాములు వేడుకున్నారు.



# కేసీఆర్ వల్లే లక్షలాది కుటుంబాలకు లబ్ది

- ఎమ్మెల్యే డా. సంజయ్
- మెట్‌పల్లిలో 66 కల్యాణ లక్ష్మి, 30 సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ..

**బలగం టీవీ, మెట్ పల్లి**

కల్యాణ లక్ష్మి –షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టిన మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు సంకల్పం వల్లే లక్షలాది కుటుం బాలు లబ్ధి పొందుతున్నాయి అని ఎమ్మెల్యే డా. సంజయ్ తెలిపారు. మెట్ పల్లి ఎంపీడీఓ కార్యాలయంలో కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ మొత్తం 66,07,656/– (అరవై ఆరు లక్షల ఏడు వేల ఆరువందల యాభై ఆరు రూపాయలు) విలువగల 66 కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అలాగే మెట్ పల్లి మండల మరియు పట్టణానికి చెందిన 30 మంది లబ్ధిదారులకు, మొత్తం 6,98,000/– (ఆరు లక్షల తొంభై ఎనిమిది వేల) రూపాయల విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కులను కూడా అందించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో తులం బంగారం ఇస్తామని చెప్పి మాట తప్పిన సీఎం రేవంత్ రెడ్డి, ప్రజలకు ఇచ్చిన హామీలను ఏవీ నెరవేర్చలేకపోయారని మండిపడ్డారు. ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా కాంగ్రెస్ పార్టీ కేవలం మాటలు, ప్రచారాలకే పరిమితమైందని తీవ్రంగా విమర్శించారు. ప్రజల కోసం కష్టపడే నాయకుడు ఒక్కరే కేసీఆర్ అని, ఆయన పాల నలో వచ్చిన సంక్షేమ ఫలాలు ఇప్పటికీ ప్రజల జీవితాలను మార్చుతున్నాయని తెలిపారు.



# బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం..

- సింగిల్ విండో అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి ఉదారత

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

మానవత్వం, ఉదారతకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు సింగిల్ విండో అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి. ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామానికి చెందిన అనారోగ్యంతో బాధపడుతున్న రెండు కుటుంబాలకు ఆయన తనవంతు సహాయాన్ని అందించి, భరోసా కల్పించారు. దుమాల గ్రామానికి చెందిన నీరంకి రవి బ్రెయిన్ హ్యామరేజ్, ఆయన భార్య లత క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. అదే గ్రామానికి చెందిన బద్దిపడగ మహేందర్ రెడ్డి ఇంట్లో ఇటీవల గ్యాస్ సిలిండర్ లీకై కిచెన్ గది పూర్తిగా దగ్ధమైంది. ఈ సందర్భంగా, సింగిల్ విండో అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి ఆయా కుటుంబాలను స్వయంగా పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని, జరిగిన నష్టాన్ని తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు. ఆర్థికంగా ఆదుకోవాలనే ఉద్దేశంతో, అనారోగ్యంతో బాధపడుతున్న నీరంకి రవి కుటుంబానికి రూ.5,000, అగ్నిప్రమాదంలో నష్టపోయిన బద్దిపడగ మహేందర్ రెడ్డి కుటుంబానికి రూ.5,000 చొప్పున మొత్తం రూ.10,000 నగదు సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసి చైర్మన్ గుల్లపల్లి నరసింహారెడ్డి, బద్దిపడిగే దేవేందర్ రెడ్డి, గుల్లపల్లి సత్తిరెడ్డి, మల్లారెడ్డి, మాధవరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మోహన్ రెడ్డి, నిమ్మల బాలు, జంగ సతీష్, మల్యాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దాడిని ఖండిద్దాం..!

- ప్రభుత్వ విద్యా పరిరక్షణ పోరాటాలను విజయవంతం చేద్దాం
- తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ పిలుపు



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ, విద్య వ్యాపారీకరణ, ప్రైవేటీకరణ, కార్పొరేట కరణలను ప్రోత్సహిస్తున్నాయని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి, ప్రొఫెసర్ కే లక్ష్మీనారాయణ (హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ) తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వ విద్య పరిరక్షణ పోరాటాలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాజన్న సిరిసిల్లలో జరిగిన తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ జిల్లా విస్తృత సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు.

విద్యా కమిషన్ల సిఫారసులను పట్టించుకోకుండా, ప్రభుత్వాలు విద్యారంగానికి ఏటా ఉద్దేశపూర్వకంగా నిధులు తగ్గిస్తున్నా యని మరియు సరైన సౌకర్యాలు కల్పించడం లేదని ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన జాతీయ విద్యా విధానం 2020 దేశ లౌకిక, ప్రజాస్వామిక విలువలను దెబ్బతీస్తోందని, విద్యను కాషాయీకరణ, కేంద్రీకరణ చేస్తోందని, దీనిని ఉద్యమాల ద్వారా ప్రతిఘటించాలని ఆయన కోరారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధాన స్రవంతి పాఠశాలలను మెరుగుపరచకుండా, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, ఇంటర్నేషనల్ స్కూల్స్ పేరుతో అప్పులు చేసి రూ. 24 వేల కోట్లు ఖర్చు చేసి నిర్మాణాలు చేయబోతున్నారని, ఇవి కాంట్రాక్టర్లకు, కమిషన్లకు ఉపయోగపడతాయే తప్ప విద్యారంగానికి మేలు చేయవని ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ అన్నారు. ప్రతి సంవత్సరం దాదాపు 2 వేల పాఠశాలలు మూసివేత జరుగుతుందని, తక్షణమే దానిని నిలిపివేసి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని ఆయన కోరారు.

తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర సహాధ్యక్షులు వై. అశోక్ కుమార్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి విద్యకు 15% నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చి కేవలం 7.3% మాత్రమే కేటాయించారని విమర్శించారు. తక్షణమే కనీసం 20 శాతం నిధులను బడ్జెట్‌లో కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా జీడీపీలో 6% మరియు వార్షిక బడ్జెట్‌లో 10% నిధులు విద్యకు కేటాయించాలని ఆయన కోరారు.

తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర సహా ప్రధాన కార్యదర్శి ఎం. రఘుశంకర్ రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలల పర్యవేక్షణకై గత 17 సంవత్సరాలుగా నిలిచిపోయిన ఎంఈఓ, డిప్యూటీ డీఈవో, డీఈవో నియామకాలను తక్షణమే చేపట్టాలని, ఉపాధ్యాయ బృందాలచే పర్యవేక్షణ చేయించడం సరికాదని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి కే. రవిచందర్ మాట్లాడుతూ.. గురుకులాలపై శ్రద్ధ పెట్టడం కన్నా ప్రధాన స్రవంతి పాఠశాలలను బలోపేతం చేయాలని, వాటిని సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలుగా తీర్చిదిద్దాలని, మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతగా అందించాలని, ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల విశ్వాసాన్ని పెంచే చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఇతర నాయకులు విద్యారంగానికి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్, డీటీఎఫ్ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ సిరిసిల్ల శాఖ సమావేశంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు దుమాల రమనాద్ రెడ్డి అధ్యక్షత వహించగా, టీపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి విక్కుర్తి అంజయ్య, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వంగ తిరుపతి, డిటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు బుర సదానందం, అలాగే టీపీటీఎఫ్, డీటీఎఫ్, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ బాధ్యులు పాల్గొన్నారు.

# వేములవాడ అభివృద్ధికి ఆది శ్రీనివాస్ కృషి



- కాంగ్రెస్ నాయకులు

**బలగం టీవీ, వేములవాడ**

వేములవాడ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్న ఘనత ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దేనని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో కొనసాగుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను సోమవారం కాంగ్రెస్ నేతలు పరిశీలించారు.

ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాగారం వెంకటస్వామి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ మాట్లాడుతూ.. సుమారు రూపాయలు 13 లక్షల నిధులతో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ పనులన్నీ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొరవతోనే జరుగుతున్నాయని వారు అన్నారు. వేములవాడ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడం జరుగుతుందని, వేములవాడను 'వెన్నెల వాడ'గా తీర్చిదిద్దడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. వేములవాడలోని అన్ని వార్డులలో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనుల కోసం నిధులను పెద్దలు ఆది శ్రీనివాస్ వెచ్చించారని వారు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కూరగాయల కొమరయ్య, నాయకులు తోట రాజు, వనపర్తి శంకర్, ఫిరోజ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# హలో మాల–చలో ఢిల్లీ..

- రాజ్యాంగ హక్కుల సాధన దళితుల ఐక్యత సభ విజయవంతం చేద్దాం..
- జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జ్ మేడి అంజయ్య



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజ్యాంగ హక్కుల సాధన కోసం నవంబర్ 26 న హలో మాల చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జాతీయ మాల మహానాడు రాజన్న సిరిసిల్లా జిల్లా అధ్యక్షులు నీరటి శ్రీనివాస్ అన్నారు. సోమవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో హలో మాల చలో ఢిల్లీ రాజ్యాంగ హక్కుల సాధన సభ కరపత్రం విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ ఆదేశాల మేరకు మాలల రాజ్యాంగ హక్కుల సాధన కోసం హలో మాల చలో ఢిల్లీ కార్యక్రమం నవంబర్ 26 న నిర్వహించడం జరుగుతుందన్నారు. మాలలపై జరుగుతున్న అక్రమాలను నిలదీస్తూ ,రాజ్యాంగ విరుద్ధంగా జీవో 99 రోస్టర్ విధానాన్ని తిరిగి పునః సమీక్షించాలని, అలాగే ఎస్సీ రిజర్వేషన్ 15 నుంచి 20 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. నూతన పార్లమెంట్ భవనానికి అంబేద్కర్ పేరు పెట్టాలని, భారత కరెన్సీ నోట్ల పై అంబేద్కర్ చిత్రం ముద్రించాలని పేర్కొన్నారు. అలాగే దేశంలో ఎస్సీ, ఎస్టీల పై జరుగుతున్న దాడులను అరికట్టడానికి ప్రత్యేక చట్టం తీసుకురావాలని, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టంలో 41 సిఆర్పి సెక్షన్ ద్వారా నిందితులను అరెస్టు చేసే అవకాశం లేకుండా పోతుందని, వెంటనే 41 సిఆర్పి సెక్షన్ రద్దు చేయాలన్నారు.ఇలాంటి 12 అంశాలతో కూడిన డిమాండ్లతో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మాలలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, మంగ. కిరణ్, ఉపాధ్యక్షులు, కిషోర్ మూలే, చందుర్తి మండల అధ్యక్షులు ఆశీనిపర్తి యేసుకుమార్, తంగళ్లపల్లి మండల కన్వీనర్ లింగం, దేవరాజు మాల సంఘం నాయకులు, గట్టెపల్లి రత్నయ్య, తుమ్మ బాబు, క్యారం శ్రీనివాస్, సద్దా జాన్, గుంటి శంకర్, భూడిద శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల కలలను సాకారం చేసిన ప్రజా ప్రభుత్వం



- **ఇందిరమ్మ ఇళ్లతో ప్రతి కుటుంబంలో సంతోషం**
- **రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**
- **ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేసిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ:**

జగిత్యాల జిల్లా వేములవాడ నియోజకవర్గం కథలాపూర్ మండలం పోతారం గ్రామానికి చెందిన పెంటల బుజ్జమ్మ నూతన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి చేసుకొని నేడు గృహ ప్రవేశం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గారు ముఖ్య అతిథిగా హాజరై నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. పెంటల బుజ్జమ్మ మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో నేడు స్వంత ఇంటి కల సాకారం అయ్యిందని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

**కార్తీక మాస వన భోజనాలలో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్**

**రాజన్న సిరిసిల్ల:** రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ అర్బన్ మండలం, అగ్రహారం గ్రామంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఆర్య వైశ్య మిత్ర మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్తీక మాస వన భోజనాలలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన నిర్వాహకులకు తన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్తీక మాసంలో వన భోజనాలు నిర్వహించడం ద్వారా ఆధ్యాత్మిక, సామాజిక ఐక్యతా భావనలు పెంపొందుతాయని ఆయన పేర్కొన్నారు. అనంతరం, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్థానిక ఆంజనేయ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు వేదో ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ%ొ% స్వామి వారి దివ్య ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు.







## ప్రజా ప్రభుత్వంలో అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు

- **చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

**బలగం టీవీ, బోయినిపల్లి:**

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో చొప్పదండి నియోజకవర్గం రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన ఐల శివరామ్ కి మొదటి విడతలో కేటాయించిన ఇందిరమ్మ ఇల్లును పూర్తి చేసిన సందర్భంగా గృహ ప్రవేశం చేస్తున్న శుభ సమయాన ముఖ్య అతిథిగా చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం హాజరై ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి,శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మల్లాపూర్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## ఘనంగా శ్రీ కార్తీక దీపోత్సవం

- **హంపీ పీఠాధీశుల దివ్యాశీస్సులు..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

స్వస్తిశ్రీ విశ్వవసు నామ సంవత్సర కార్తీక మాసంలో అత్యంత పవిత్రమైన బహుళ అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని, శ్రీ కార్తీక దీపోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. హిందూ ఉత్సవ సమితి, ఎల్లారెడ్డిపేట మండలం, శ్రీ గీతా మందిరం, రాచర్ల గొల్లపల్లి, బొప్పాపూర్ ఆధ్వర్యంలో ఈ పుణ్యకార్యక్రమాన్ని 2025, నవంబర్ 20, గురువారం సాయంత్రం ఐదు గంటలకు రాచర్ల బొప్పాపూర్ గొల్లపల్లి జక్కుల చెరువు వద్ద శ్రీ కార్తీక దీపోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. ఈ మహొత్సవానికి హంపీ పీఠాధీశులు, శ్రీ శ్రీ శ్రీ విద్యారణ్య భారతీ స్వామి వారు స్వయంగా విచ్చేసి భక్తులకు దివ్యానుగ్రహ సందేశం అందించనున్నారు. అనంతరం, బ్రహ్మశ్రీ రాచర్ల రఘురామ శర్మ మరియు రాచర్ల విశ్వనాధ శర్మ ల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జ్యోతి ప్రజ్వలన, దీపాలంకరణ వంటి విశిష్ట కార్యక్రమాలు జరుగుతాయి. కార్తీక దీపోత్సవంలో భక్తజనులు సకుటుంబ సమేతంగా పాల్గొని, స్వామివారి కృపా కటాక్షాలకు పాత్రులు కావలసిందిగా ఉత్సవ నిర్వాహకులు మనఃపూర్వకంగా ఆహ్వానిస్తున్నారు.

# రాజన్న సిరిసిల్ల జిల్లాలో అండర్-14, 16 బాలికల అథ్లెటిక్స్ పోటీలు..



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

భారత క్రీడా ప్రాధికార సంస్థ మరియు యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ప్రతిష్టాత్మక 'ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్'కు అధికారిక నామంగా ఉన్న అస్మిత లీగ్ లో భాగంగా, రాజన్న సిరిసిల్ల జిల్లాలో అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించడం జరుగుతుంది.భారతదేశంలోని 26 రాష్ట్రాల నుండి 300 జిల్లాలను సెలెక్ట్ చేసి అందులో నుండి బాలికలను అండర్ 14 మరియు అండర్ 16 రెండు భాగాలుగా విభజించి వీరికి పోటీలు నిర్వహించడం జరుగుతుంది. ఈ పోటీలను నవంబర్ 10వ తేదీ నుండి నవంబర్ 30 వరకు నిర్వహించడం జరుగుతుంది. అందులో భాగంగా మన రాజన్న సిరిసిల్ల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఈనెల 24వ తారీఖున ఈ పోటీలను కాలేజీ గ్రౌండ్ సిరిసిల్లలో నిర్వహించడం జరుగుతుంది.

**పోటీల ముఖ్య ఉద్దేశం**

గ్రామీణ ప్రాంతాల నుండి అండర్ 14 అండర్ 16 బాలికలకు పోటీలు నిర్వహించి వారిలో దాగివున్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడం ఈ క్రీడల ముఖ్య ఉద్దేశం.

మెయిన్ ఫోకస్: రన్నింగ్, డిస్కస్ త్రో, షాట్ పుట్, జావలిన్ త్రో..

**కట్ ఆఫ్ డేట్స్**

అండర్-14 బాలికలు: 21/12/2011 నుంచి 20/12/2013 మధ్య జన్మించిన వారు.

అండర్-16 బాలికలు: 21/12/2009 నుంచి 20/12/2011 మధ్య జన్మించిన వారు.

మరిన్ని కనుగొనండి

పోటీలు: ఈ పోటీలో పాల్గొనే అండర్ 14 మరియు అండర్ 16 బాలికలకు మాత్రమే పోటీల్లో పాల్గొంటారు.

అండర్ 14 బాలికలకు ట్రైయాతలాన్ A,B,C ఉంటాయి.

ఏ: 60మీ, లాంగ్ జంప్ (5మీ అప్రోచ్), హై జంప్ (సిజర్).

బీ: 60మీ, లాంగ్ జంప్ (5మీ అప్రోచ్), బ్యాక్ త్రో (1కేజీ షాట్‌పుట్).

సీ: 60మీ, లాంగ్ జంప్ (5మీ అప్రోచ్), 600మీ మరియు కిడ్స్ జావలిన్ 5 మీటర్ల రన్‌వే ఉంటుంది.

అండర్ 16 బాలికలకు.. 60 ఎం, 600 ఎం, హై జంప్ (సిజర్), లాంగ్ జంప్ (5మీ అప్రోచ్), డిస్కస్ త్రో, షాట్‌పుట్ (స్టాండింగ్) 3కేజీ, జావలిన్ త్రో (10మీ అప్రోచ్) 500 గ్రాముల పోటీలు ఉంటాయి.

ఈనెల 24న కాలేజీ గ్రౌండ్ సిరిసిల్లలో అండర్ 14,16 బాలికల విభాగంలో అస్మిత అథ్లెటిక్స్ లీగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ తెలియజేశారు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ రాజన్న సిరిసిల్ల ఆధ్వర్యంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఖేలో ఇండియా లో భాగంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా ఎస్పీ మహేష్ గీతే, జిల్లా విద్యాధికారి వినోద్ మరియు క్రీడల అధికారి అజ్మీరా రామదాసు మరియు, మునిసిపల్ కమిషనర్ ఖదీర్ పాషా లతో అస్మిత ఉమెన్ లీగ్ పోస్టర్ ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాలికల్లో ఉన్న క్రీడ నైపుణ్యాన్ని గుర్తించే లక్ష్యంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

జిల్లా వైస్ ప్రెసిడెంట్ గొట్ట రామచంద్రం మాట్లాడుతూ.. ఈ క్రీడలు బాలికలకు మంచి బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలియజేశారు. ప్రతిభ గల బాలికలు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలలో అత్యుత్తమ నైపుణ్యం కనబరిచిన క్రీడాకారులకు వారి బంగారు భవిష్యత్తుకు ఈ క్రీడలు నిదర్శనంగా నిలుస్తాయని వారికి అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మరియు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఖేలో ఇండియా వారు అత్యుత్తమ శిక్షణను ఇచ్చి వీరిని భవిష్యత్తులో ఏషియన్ గేమ్స్ కు అదే విధంగా ఒలంపిక్స్ కు తయారు చేయడం జరుగుతుంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 13 మండలాల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల క్రీడాకారి నులకు ఇది సువర్ణ అవకాశమని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ రాజన్న సిరిసిల్ల ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ అన్నారు పోటీలో పాల్గొనే క్రీడాకారులకు ఎటువంటి ప్రవేశ రుసుము లేదని ఆసక్తి గల క్రీడాకారులు తమ ఎంట్రీలను మేము పంపిన ఎన్ఎస్ఆర్ఎస్ పోర్టల్ ద్వారా https://account.kheloindia.gov.in/#/athlete-signup లింకు ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. వివరాలకు ఈ నెంబర్ లను 7901464456 / 9441456385సంప్రదించాలని సూచించారు. వైస్ ప్రెసిడెంట్ గొట్టే రామచంద్రం, కోశాధికారి వినోద్, జాయింట్ సెక్రటరీ అజయ్ కుమార్, ఈసీ మెంబర్స్ ఉడ్నాల శ్రీనివాస్, బొల్లాజీ శ్రీనివాస్ ల పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రైతులకు ఇబ్బందులు..

- **సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు**

**బలగం టీవీ, సిద్దిపేట**



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వరి ధాన్యం, మక్కలు, పత్తి కొనుగోళ్లలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని సిద్దిపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు హరీష్ రావు మండిపడ్డారు. సిద్దిపేట జిల్లా, చిన్నకోడూరు మండలం మల్లారం గ్రామంలోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొంటామని చెప్పి, ఇప్పటివరకు కేవలం ఐదు నుంచి ఆరు లక్షల మెట్రిక్ టన్నుల వడ్లను మాత్రమే కొనుగోలు చేసిందని హరీష్ రావు విమర్శించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి కూడా సకాలంలో బిల్లులు చెల్లించడం లేదని, దాదాపు రూ. 1200 కోట్ల రూపాయల మినిమం సపోర్ట్ ప్రైస్ (%మీఎ్రా%) బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. మాటల్లో 24 గంటల్లో ఇస్తామని చెప్పిన ధాన్యం బోనస్ డబ్బులు రూ. 200 కోట్లు ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని ఆరోపించారు. పోయిన యాసంగి, ఈ వానకాలం బోనస్ డబ్బులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర చలిలో రైతులు పడిగాపులు కాస్తున్నందున, వడ్ల కొనుగోలును వెంటనే వేగవంతం చేయాలని, యుద్ధ ప్రాతిపదికన మిల్లులను టై అప్ చేయాలని కోరారు. రాష్ట్రంలో ఆరు లక్షల ఎకరాల్లో మక్కలు పండించిన రైతులకు ప్రభుత్వం అన్యాయం చేస్తోందని హరీష్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. "ముఖ్యమంత్రి మక్కల కొనుగోలును నిర్లక్ష్యం చేస్తున్నారు. మక్క రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. వెంటనే మక్క కొనుగోళ్లను వేగవంతం చేసి, రైతులకు డబ్బులు విడుదల చేయాలి" అని డిమాండ్ చేశారు. పత్తి రైతుల పరిస్థితి కూడా ఆగం అయ్యిందని హరీష్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులను అరిగోస పెడుతోందని విమర్శించారు. ఎకరానికి కేవలం 7 క్వింటాళ్ల పత్తి మాత్రమే కొంటామని సీసీఐ ఆంక్షలు విధించడం వల్ల 11-12 క్వింటాళ్లు పండిన రైతులు మిగిలిన పత్తిని ఏం చేయాలో తెలియక సతమతమవుతున్నారని తెలిపారు. ఒకవైపు జిన్నింగ్ మిల్లులు, మరోవైపు కేంద్ర ప్రభుత్వ సీసీఐ కొనుగోళ్లను సరిగా చేపట్టకపోవడం వల్ల పత్తి రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్న పరిస్థితి రాష్ట్రంలో నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులను అన్ని రకాలుగా మోసం చేశారని ధ్వజమెత్తారు.